# ప్రత్యక్ష ప్రమాణం

శ్రీమతి రాజేశ్వరీగారు

కృష్ణయ్య ఆవూరి బడిపంతులు. అతడే పెద్దమాస్టరు, అతడే అసిస్టెంటు, అతడే సర్వమున్నూ. ఆ గ్రామానికి వారంరోజులకోసారి పోస్టు రన్నరు కటాక్షం కలిగితే వచ్చే యే వుత్తరమైనా చదివి అర్థం చెప్పగల పండితు డతడొక్కడే. గ్రామభుక్తగారు సైతం గంటన్నరసంధ్య వార్చగలరే కాని సంతకం మాత్రం ఎడమచేతి బొటనవ్రేలిదే. కృష్ణయ్యకి నెలకి ఆరురూపాయిలు కరువల్లాగ బడిపంతులుజీతం అందుతుంది. అదిమినహాగా అతనికున్న రాబడి నిండుసున్న. గ్రామస్థులందరూ కలిసి ఒక ఊపాంతపు మెట్టు అతనికి యిచ్చి మిద్దిటిల్లు నిర్మించి యిచ్చేరతనికి. ఇంటికొకతూముడుచొప్పున సంవత్సర గ్రాసం; అటుపైని కూరగాయలూ, మజ్జిగ, మొదలైనవి కృష్ణయ్యకు నిత్యవార్షికాలు — జీతంలోంచి కొంటే ఉప్పూ కిరసనాయిలూ కొంటాడు.

కృష్ణయ్యకు మరేవ్యాపకం లేనప్పుడే బడి తెరుస్తాడు. అధికమాసంలాగ స్కూళ్ల ఇన్‌స్పెక్టరు రాక ముందుగానే తెలుస్తుంది గనుక ఆ రెండు రోజులూమాత్రం పొలాలంటపోయిన పిల్లలనీ, కనీసం ముప్పైయేళ్లలోపువాళ్ల నందర్నీ, తీసుకొచ్చి బడి తీరుస్తాడు. తక్కినరోజుల్లో కృష్ణయ్యకు బాతాఖానీ తప్ప వేరుపనిలేదు.

సంక్రాంతికి నెలగంట పెట్టేరు. ఎప్పుడూ తెరవని బడికి బాహాటంగా పండుగసెలవులిచ్చి కృష్ణయ్య వీధరుగుమీద కూచున్నాడు. సాయంకాలమైంది. ఎదురుగావున్న కోనేటిమీదనుంచి గాలి తెరతెరలుగా వస్తూంది. ఫుంతలోనున్న బురదలో జలక్రీడలాడించి పోతులనూ గేదెలనూ తోలుకొస్తూన్న కాపుకుర్రల అర్థంలేనిపాట అంతరిక్షాని కంటుతూంది. కృష్ణయ్యకు మాటలాడడానికి మనిషెవడూ దొరక్క, చిన్న గావంచా పీఛుచుట్టుగా ముణుకులకు ముడివేసి తిరపతి డోలీలో కూర్చున్నట్టు వూగుతున్నాడు. పూరింటి పంచ దొరటోపీలాగ అతని కుదురుమాత్రం కప్పివుంది.

ఎదురుగా చెరుకుతోటల్లో సూర్యుడు గ్రుంకుతూ వుండగా, కోనేటిమెట్లమీద నెవడో బాటసారి, తడిసినపాదాలు దులుపుతూ పైకెక్కివస్తున్నాడు. కృష్ణయ్యకు కాలక్షేపానికి గ్రంథం కనిపించినట్లైంది.

"ఎవరయ్యా...వోయ్... ఇలారండి. యేవూరుమీదిని?"

"అయ్యా, మా వూరాండి? మాది ముందూరు."

"అబ్బో, యెవరయ్యోయ్ నువ్వు, పెద్దవేదాంతిలా గున్నావే!"

కృష్ణయ్యవద్దనున్న గొప్పప్రజ్ఞ అది. ఎంత అపరిచితుడైనా సరే, మూడుముక్కల్లో 'అండీ'లోంచి 'అబ్బీ'లోకి దింపేస్తాడు.

"ఎప్పుడూ మీది ముందూరే అయితే, నువ్వెల్లప్పుడూ పొరుగూరులోనే వుంటావన్నమాట; యేమంటావు, నే చెప్పింది?...అబ్బో, నన్ను మాటల్లో బోల్తా కొట్టించేపాటి వా డెవడున్నాడు?"

"స్వామీ, మీతో వాదించేపాటి వాడనా? యతానాస్తి పితానాస్తి అన్నలాంటి అనాథులం మాకు వూ రేమిటి పేరేమిటి, స్వామీ?"

"అబ్బో, నువ్వూ కొంచెం డొక్కశుద్ధి పొందిన వాడిలాగున్నావు ... ఉత్తరరామాయణానికి అర్థం చెప్తున్నానిప్పుడు, కావలిస్తే యీ రాత్రివిని వెళ్లు."

"అయ్యా, ఉత్తరరామాయణం వింటాగాని అది ఊర్ధ్వలోకానికే ఉపయోగం — సాపాటేదో అదే సద్యఃఫలం. ఆకలిగొన్నవాడికి అనుష్టుప్పుశ్లోకాలతో పొట్టనిండునా స్వామీ ?"

"ఆరె, నీ..., నువ్వొక్కడో ఉద్దండపిండంలా గున్నావే. పానుగంటి జంఘాలశాస్త్రి ధోరణి కొంచెం నీలో కనిపిస్తూంది... నాకేం అభ్యంతరం లేదుకాని, వండివడ్డించేది మా ఆవిడ ; ఆ విడను కనుక్కో—ని—"

"బాబూ, మీ పిల్లలతోపాటు మరోవిస్తట్లో—"

"ఆగు ఆగు. అక్కడే పొరపాటు పడుతున్నావు— మా ఆవిడవుండే — (సావిట్లో తొంగిచూచి) అక్కడ ఆ ప్రసంగం యెత్తకూడదు...నువ్వెరగవు కాబోలు, నేను కేవలం ఆనందస్వరూపం ; ఆవిడమాత్రం, అటుచూడు, ఆ — నందస్వరూపం......కానీ, శ్లేష కవిత్వాని కున్నరుచీ యేడుకూరల పులుసుకి లేదు సుమా !"

శేషమ్మ ఘోషాచేగాక కేవలం విస్తీర్ణంచేత వీధి గుమ్మం దాటలేక తొంగిచూచి కృష్ణయ్యను రాత్రి వంట నిమిత్తం సలహాచేసింది. పరులయెదుట తన ప్రతిభను భంగపర్చనందుకు శేషమ్మను మనసులోనే మెచ్చుకుంటూ, కృష్ణయ్య అతిథివచ్చిన విషయం తెలిపి అప్పడాలుకూడా కాల్చమని వెనకాలే కేక వేసేడు.

"ఏమయ్యా, కోనేటిమెట్లమీదికిపోయి అందాకా కూర్చుందామా ?"

"అలాగే కానీండి, స్వామీ."

"చూడూ, అన్ని ఋతువుల్లోనూకూడా, గాలి బారడంవుండే, అది వొంటికి మహామంచిది. నీడనుంటే చెట్టుసైతం బతకదు."

"అన్నిగాలులూ అనుభవించిన, అనుభవిస్తూన్న నాతో దాని బాగోగులు నేవించమని చెప్పాలా ?"

ఆ కోనేరు చాలా విశాలమైంది. నాలుగుగట్లనుండి కుచ్చెళ్లుపోసినట్లు రాతిమెట్లు నీటిలోదాకా దిగి, ఆ జలకన్యకు మరింత శోభతెస్తున్నాయి. నాల్గు దిక్కులనుండి కమ్ముకుని వస్తూన్న చీకట్లలో, వారిద్దరూ ఆ మెట్లపైని చతికిలబడ్డారు. కృష్ణయ్యకి నేడు బ్రహ్మానందంగావుంది. కీయిస్తే పరుగెత్తే బండిలాగ, అతనికి బాటసారి లభించడాన్ని నాలుక విజృంభిస్తూంది.

"స్వామీ, ఆవలిగట్టునవున్న శిథిలాలు యేదైనా ఆలయమా ?"

"యేం చల్లనివేళ కదిపేవయ్యా ఆ విషయం. నే వ్రాసిన దదొక్కటేకథ ; ఆ తర్వాత మరి వ్రాద్దామంటే మా ఆవిడ పడనిచ్చిందికాదు. చూడూ, మనం బాగా ఆలోచిస్తే, యీ ప్రపంచంలో కవి అన్నవాడికి పెళ్లికాకూడదు ; పెళ్లికానిఅయిందో, వాడు కవిత్వమేనా వొదులుకోవాలి పెళ్లాన్నేనా వొదులుకోవాలి......రెండింటికీ మాత్రం పొసగదు."

"బాబూ, మీరు రెంటినీ విడిచినట్టు తోచదు ; ఆ ఆలయం విషయంమాత్రం చెప్పకుండా విడిచేరు."

"అదే అదే. ప్రస్తావన వొచ్చిందిగనుక చెపుతున్నాను. ఆ ఆలయంవుండే అది దేవాలయంకాదు. ఒక పెద్దసంసారి తాలూకు యిల్లు."

"శ్రీహరి ! పశుపత్నిసుతాలయాలు నాలుగింటిలోను చిరస్థాయి కావలిసిన కొసదే జీర్ణించిపోయినపుడు కడమవాటి విషయమేమై యుంటుందో !"

"వింటే, నీకే తెలుస్తుంది. అదిఒక అద్భుతమైన కథకింద పెంచి వ్రాసేను నేను. మొదట అనిర్గళంగా ప్రబంధకవిత్వం చెప్పిచెప్పి, చెలామణీ కాకపోడాన్ని, కడుపుకోసం యీ వూరుచేరేను యిరవైయేళ్లక్రిందట. అప్పుడీ అయ్యలరాజువారి లోగిలి, ఓ, భూలోక

వైకుంఠంలాగుండేది. రామచంద్రయ్యగారంటే వయసున పాతికేళ్లవాడైనా, చేతి కెముకలేనివాడని సుప్రసిద్ధిపొందేడు. ఇక్కడ బడిపంతులు పని నాకు చేయించింది ఆ దాతే... మనం మంచికిమంచీ చెప్పుకోవాలి — చెడ్డవుంటే మనం చెప్పకుండానే లోకం వెయ్యినోళ్ల చాటిపోస్తుంది. లోకము మాయగ మూకుడున్నదే, అన్నాడు కవి... కానీ, శ్రవణానందంతోటి ప్రబంధాలరోజులు వెళిపోయేయినుమా! యేదీ ఆ పద్యం:—

'ముంగాల సింగార... ..' "

"నా సంగతి విడిచి అప్పుడే అడ్డుదారి తొక్కేసేరు స్వామీ!"

"అడ్డుదారేమిటి, కవికి అన్నీ దారులే. నిరంకుశాః కవయః అన్నాడు... అయితే ఆ రామచంద్రయ్యగారికి చంద్రుడిలో మచ్చలాగ ఒక దుర్గుణంవుండేది."

"యేమదీ?"

"భార్యమాట జవదాటకపోవడం."

"రామరామ! యెంత దుర్గుణం చెప్పేరుబాబూ!"

"కాదూ? దుర్గుణమని మెల్లిగా అంటావేమిటి? దుర్వ్యసనమని చెప్పక?... నే చెప్తాను వినూ! సంసారసూత్రంలో ఒక్కటే రహస్యం. ఆడదాన్ని అప్పడాలపిండిని యెంత మర్దిస్తే అంతరుచి. యీ సూత్రం ఒక్క మా ఆవిడపట్ల అన్వయించిందికాదు. యెంచేతనో యెరుగుదువా; 'అతివలజూచి వీరబల లంచు వచించు మహాకవీంద్రులుద్ధత విపరీతవాదు'లని మా ఆవిడని చూసి చెప్పివుండాలి."

"సరే, తర్వాత?"

"చంద్ర భాగాదేవి—అంటే రామచంద్రయ్యగారి భార్య—చాలా ఉత్తమురాలే అయితేనేం, పెనిమిటి వల్ల యేస్వల్పవిషయంలోనూ తిరస్కారం సహించలేకపోయేది."

"అంతటి అనుకూల దాంపత్యానికి నేరారోపణ మీవంటి కవీశ్వరులు చెయ్యాలి కాని—"

"నేరం వుందోలేదో నీకే తెలుస్తుంది, తుదముట్టా విను. పదిపన్నెండేళ్లు కాపురంచేసిన తర్వాత, రామచంద్రయ్యగారికి సంతానంలేమికి ఓదార్పురీతిగా, ఆయన సోదరుడును భార్యయు అకస్మాత్తుగా మరణించి తమ యేకైక పుత్రికను, మూడేండ్లదానను, దిగవిడచిరి. ఆపిల్లను రామచంద్రయ్య చంక బెట్టుకుని గుమ్మములో కాలుబెట్టిననాడే లక్ష్మీవారి గుమ్మము వెలుపల కడుగుపెట్టినది. చంద్రభాగకు—కరుణతప్ప అన్యమెరుగని ఆ యిల్లాలికి—ఎక్కడనుండి ఊరిందో ఆ పసిదానమీద అవ్యాజద్వేషం అంకురించింది."

"నిజం? నేను నమ్మలేకున్నాను"

"అయితే నువ్వు రెండోవాడివి. మొదటివాడామెభర్త. లోకమంతా గుసగుసలాడుకుంటూన్న ఆమె కుత్సితం, రామచంద్రయ్య యెన్నడూ గ్రహించలేదు; అవసానకాలానికైనా తెలిసివుంటుందని—"

"అతడెన్నాళ్లయింది, గతించి?"

"రెండేళ్లవుతుంది. అతని మృతికిసైతం కారణమతని భార్యయే. అతనికేదో శూలనొప్పి బాధ అప్పుడప్పుడు వుండేదట. అది చంపే జబ్బుకాదు. అయితేనేం, ఆపరేషనుకోసమని చెన్నపట్నం పంపింది భార్య. అతడు బహుదూర దృష్టికలవాడు గనక తమ పెంపుడుపిల్లను పెళ్లిచేసి—యీ అవతల వీధిలో భుక్తగారి అబ్బాయికే—ఆ యేడేండ్లపిల్లనూ అత్తింటనే దిగవిడిచి, భార్యను పుట్టింటికి పంపి, తను రాయపేట ఆస్పత్రిలో చేరేడు...... వారంరోజులనాడు అతడు చనిపోయేడని టెలిగ్రామూ."

బాటసారికి కడపటిముక్క వినిపించినట్టులేదు. అతడు గజగజవణకుతూ పైనున్న బట్టతో చెవులు సైతం కప్పుగుని "అబ్బా, యీవూళ్లో యెంతచలీ?"

అన్నాడు. కృష్ణయ్యమాత్రం తనధోరణి విడిచేలాగు లేడు. చుట్టుప్రక్కల నంతటా నిశ్శబ్దమే శ్రుతి చేసుకొని రెండుమూడు కీచురాళ్లు గీఁవని గుక్క తిప్పకుండా రొద చేస్తున్నాయి.

"ఆ ఘోరవార్త వినగానే పాపం చంద్రభాగ తన కుపశమనముగా తనపెంపుడు పిల్లను చేర దీయ బోయినది కాని అన్నీ యెరిగిన ఆపిల్ల అత్తవారు మళ్లీ యీమెను చూపుతారా?"

"బాబూ నాకు తెలీక అడుగుతున్నాను. ఆపిల్ల కేమైనా అపచర్య పినతల్లివల్ల కలిగిందని వెల్లడి అయినదా?"

"అయ్యో, పిచ్చివాడా! దాని కెందుకుంటుం దోయ్ యీ పిల్లమీద అభిమానం?"

"ఉండకూడదా?"

"అదేంమాట? అవకాశమేదీ?... ఇంతకూ లోక మంతా మొదటే నిశ్చయించేసేరు, యీపిల్లంటే చంద్ర భాగకు కిట్టదని."

"లోకమంటే, యీ పూరిహార నేనా"?

"చాలదూ?...మరి నాలుగు నెలలనాడు చంద్ర భాగ, మరి కాలుంజారిందో, లేక కోరి చేసిందో, యీ కోనేట్లోనే__"

"శ్రీహరీ,—అబ్బబ్బా — నేను భరించలేను బాబూ నే భరించలేను; యీచలి—ఈ యీదురుగాలి ఈ ఆకలి, యీదాహము!"

కృష్ణయ్యకి కరచరణాలాడలేదు. నోసిలితో కోనేటినీళ్లు తెచ్చి నాలుగుసార్లు బొటసారి మొహం మీదజల్లి నోట్లోపోసేడు.

"అయితే,— చెప్పండి స్వామీ, యీనీట్లోనే యీకోనేట్లోనే__?"

"సరిసరి! నువ్వెక్కడో ఉత్తపిరికి పందలా గున్నావు. అసలు సంగతి యింకా చెప్పేలేదూ!"

"యేమి?"

"నాకథ—అంటే అందుమీదనే నల్లినకథ. ఆస్పత్రిలో అతనుపోయేడని టెలిగ్రాంవచ్చిందా? ఆమర్నాడులేదు మూడోనాడేంట, రాయపేట ఆస్పత్రితాలూకూ మృతకళేబరశాలలోంది ఒక కళేబరం యెవరో యెత్తుకుపోయేరని ఆంధ్రపత్రికలో పడ్డాది—

అప్పుడు నాకేమిటితోచిందీ, కళేబరం పోవడం అన్నది, రామచంద్రయ్యబతికి తప్పించుకు పారిపోయే డనే కల్పన కవకాశమిస్తూంది కదా అని చెప్పి కథంతా యిప్పుడు చెప్పినట్టే వ్రాస్తూ,రామచంద్రయ్య మళ్లీ యిక్కడికి వచ్చినట్టూ, పూరంతా ఆశ్చర్య పడ్డట్టూ, పోయిన భార్యకై అతడు విచారిస్తూ, పెంపుడుకుమార్తె పేర యావదాస్తి వ్రాసియిచ్చి తాను కాశీ పోయినట్టూ కథపెంచి వ్రాసేను.... యెందుకూ, అది పత్రికకి దేనికీ పంపలేకపోయేననే విచారం?"

"ఎందుచేత?"

"మా ఆవిడ ఆకాగితాలు నిప్పుచెయ్యడంకింద వుపయోగించేసింది. నేను కోప్పడబోతే యేంలాభం?"

"పోనీండి బాబూ, కథలో నాయికకు జలగండం భగవంతుడే యిచ్చేడు. నాయకుడికి అగ్నిసంస్కారం మీకృతంగా జరిగేయోగ్యత వుండెను!"

అప్పుడే రాత్రి పదిగంటల సమీపమై వుంటుంది. గ్రామంఅంతా అప్పుడే నిశ్చల సమాధిలో మగ్నం అవుతూంది. దూరంగా యెక్కడో బండికి కందెన పెడుతూన్న కిరకిరశబ్దం ఆచీకటి తెరల్లోంచి, యేదో పరలోకజీవుల యాతనవలె, అతి కర్కశంగా విన వస్తూంది.

కృష్ణయ్యకు ఆనిశాప్రళయ స్వరూపంద్యోతకం కాగానే, యింటివద్దనున్న కాళీస్వరూపంయేమి గర్జా రావంచేస్తూందో అని తలచి ఉలిక్కిపడి "యీ పాటికి వెడదామా?" అన్నాడు.

# గృహలక్ష్మి

బాటసారి అక్లేశుని "స్వామీ, మీరు నడవండి, మీ వెనకనే అయిదునిమిషాల్లో వస్తున్నా"నంటూ ఒక మెట్టువెంబడి తిన్నగా వెళ్లసాగేను. కాలకృత్యములకనిగొంచి, కృష్ణయ్యముందుగా యింటిదారి పట్టేడు.

కృష్ణయ్య యింటి గుమ్మమెక్కి తలుపుతట్టడం ఆరంభించేడు. ఇంతకూ లేదు, అంతకూ లేదు, శేషమ్మ అలికిడి. నిద్రిస్తూందో అతను ధన్యుడే. అలిగిటుక్కు పెట్టిందో తలుపుతీయడంతోటే ఒక ఘెళఘెళార్భటితో ఉల్కాపాతం అతడిమీద పడడం నిశ్చయం... తలుపీరాత్రి తెరిచేలాగ తోచలేదు. సరే, పురాణం కానిచ్చి భక్తగారి అరుగుమీదే పడుక్కుందామని కృష్ణయ్య అక్కడికి పోయేడు. అక్కడ జనమంతా యితడికోసం యెదురుచూస్తూ, చేరబడడానికి సుఖమైన స్థలం లభించినవాళ్లు ఆవులిస్తూ, వితంతుబృందం ఊరికోడళ్ల నెలలు లెక్కకట్టక వాదించుకుంటూ, యిట్లా పురాణంకోసం సిద్ధంగా ఉన్నారు. కృష్ణయ్య కిర్రు చెప్పులధ్వనిబట్టి అక్కడ యేమరుగుననో కూర్చున్న శేషమ్మ, తాళపుగుత్తి శబ్దభేదిలాగ అతనిముఖము మీదకై గురిచూచి విసిరి, "ఓలాంతరు తీసుకువెళ్లి స్వయంగా తామూ చుట్టం వడ్డించుకు మింగుతారు, నేలేవలేను" అంటూ అనుజ్ఞాపత్రం జారీచేసింది.

కృష్ణయ్య బ్రతుకుజీవుడా అనుకుని లాంతరుచేత పుచ్చుకు నింటికి వచ్చేడు...ఇంటి అరుగుమీద బాటసారిలేదు. ఇంకా రాలేదేం చెప్మా కోనేటినించీ? అనుకుంటూ దారి యెరగడేమో చీకట్లోనని దీపం పట్టుకుని కోనేటికెళ్లేడు కృష్ణయ్య. అక్కడసైతం లేదు—దూరంగా అవతలిగట్టుని నీటిచేరువ మెట్టు మీద యేదో తెల్లగా కనిపిస్తూంది. మెట్లంటచుట్టు తిరిగి కృష్ణయ్య అక్కడకువచ్చేడు. అక్కడా లేడు బాటసారి; యేవో బట్టలున్నాయి! ఆప్రక్కనే, కుంకుమా పసుపూ విరజిమ్మివున్నాయి!...

కృష్ణయ్యకి వొళ్లు జలదరించింది అయినా అతని లోని కవితామార్దవమంతా కరడుబారిపోయి వుండడాన్ని ధైర్యంతెచ్చుకొని ఆ బట్టలు విడమర్చేడు ఒక చింకిలాల్చీ జేబునుండి రెండు కాగితంముక్కలు పడ్డాయి.

దీపంవెలుగున చూస్తే ఒకదానిమీద యిట్లుంది:—

"చంద్రభాగ అమాయిక — యీ పాడులోకం, దుష్టత్వం నమ్మినట్టు సజ్జనత్వం నమ్మదు. ప్రేమలేదని అనుకునే తావున, ప్రేమకనిపించినా గ్రుడ్డిలోకం చూడదు, అంగీకరించదు."

రెండవకాగితం కృష్ణయ్యకే ఒకవుత్తరం:—

"స్వామీ, మీకథలో చేసినకల్పన బహుస్వాభావికమని నేనే మీకు రుజువు. ఇందులోవుంచిన నెం 113 రు టిక్కట్టు, రాయపేట ఆస్పత్రివారు నా మెడకుకట్టినది, పరలోకయాత్రకోసం. కాని మీ కథరీతిగా, నేను నా పెంపుడుబిడ్డ యెదుటపడితే, లోకం నన్ను సజీవునిగా నమ్మదు, మీ రొక్కరు నమ్ముదురేమో కాని. ఆనాడు, పోయిన కళేబరము నేనే అనిగాని, విధివశమున పునర్జీవితుడనై వచ్చుట సత్యేతరము కాదనిగాని లోకమును నమ్మించుట యెట్లు? నాకున్నది ఒకటేమార్గము,— నా అర్ధాంగి చంద్రభాగ పెట్టినమార్గం!

ఈరాత్రి, తమ దోసిలితో పోసిన యీ నాజలము నాకమృతమైనది. దానిలోనే యున్నది నా సర్వస్వము, నేనును.

—రామచంద్ర."